సాక్షి ఖమ్మం
7
ఆదివారం । 11 । జూన్ । 2023



సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్

పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతుందని జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్ వెల్లడించారు. 10లో

నేడు గ్రూప్–1 పరీక్ష

జిల్లాలో 50కేంద్రాలు, 17,366మంది అభ్యర్థులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) ఆధ్వర్యాన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జరగనుంది. గత అనుభవాల దృష్ట్యా ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా అధికార యంత్రాంగం సిద్ధమైంది. జిలాల్లోని 50 కేంద్రాల్లో ఉదయం 10–30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు 17,366మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అభ్యర్థులను ఉదయం 8–30నుంచి 10–15గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు.

పకడ్బందీగా నిర్వహించేలా..

గ్రూప్–1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించేలా కలెక్టర్ గౌతమ్ అధికారులతో పలుమార్లు సమావేశమై సూచనలు చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఖమ్మం, ఖమ్మం రూరల్, కొణిజర్ల మండలాల్లోని విద్యాసంస్థల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఆయా కేంద్రాలను 11రూట్లుగా విభజించి 50మంది లైజనింగ్ అధికారులను నియమించారు.

నిబంధనలివే..

అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు తీసుకురావాలి. బూట్లు, వాచీలను అనుమతించరు. జిల్లాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు.

ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న ఎం.డీ. ముజాహిద్‌ను ఏన్కూరు తహసీల్దార్‌గా, కలెక్టరేట్ సూపరింటెండెంట్ జి.కృష్ణను మధిర, సీహెచ్. రమణిని బోనకల్ తహసీల్దార్‌గా నియమించారు. వీరంతా త్వరలోనే విధుల్లో చేరనున్నారు.

సంక్షేమమే మా లక్ష్యం



మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ, వేదికపై మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే హరిప్రియ, కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్, మేయర్ నీరజ తదితరులు

- తహసీల్, పీఎస్ ప్రారంభ సభలో హోం మంత్రి మహమూద్ అలీ
- రూ.254 కోట్లతో రఘునాథపాలెం అభివృద్ధి : మంత్రి పువ్వాడ



తహసీల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు పువ్వాడ, మహమూద్ అలీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రజాసంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని.. అన్ని వర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ వెన్నుదన్నుగా నిలుస్తున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. రఘునాథపాలెంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి హోం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో హోంమంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పోరాడి సాధించిన తెలంగాణలో సీఎం కేసీఆర్ నేతృత్వాన జరుగుతున్న అభివృద్ధి చూసి ఇతర రాష్ట్రాల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోందని చెప్పారు. మంత్రి కేటీఆర్ చొరవతో హైదరాబాద్‌కు అనేక పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పోటీ నెలకొందని పేర్కొన్నారు. ధరణి పోర్టల్ వల్ల అనేక లాభాలున్నాయని, రైతు భూమి సురక్షితంగా ఉంటుందే తప్ప అన్యాయం జరిగే అవకాశం లేదన్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కృషితో ఖమ్మం జిల్లా అభివృద్ధి చెందుతున్నందున, మరోమారు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

రఘునాథపాలెం రూపు మారింది..

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ 2009లో తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి రఘునాథపాలెం మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో రూ.254 కోట్లతో మండల రూపురేఖలను మార్చామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండగా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఆ బాధలు తప్పి ఆనందంతో ఉన్నారన్నారు. కాగా, రఘునాథపాలెం పీఎస్‌ను ఖమ్మం రూరల్ ఎస్‌హెచ్‌ఓ పరిధి నుంచి ఖానాపురం హవేలి ఎస్‌హెచ్‌ఓ పరిధిలోకి తీసుకురావాలని హోంమంత్రిని కోరారు. ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ ధరణిపై కాంగ్రెస్‌తో సహా విపక్షాలది రాజకీయ రాద్ధాంతమని విమర్శించారు. రైతుబంధు నగదు తీసుకుంటున్న విపక్షాల నేతలు ధరణిని రద్దు చేయాలనడంలో అర్థమేమిటని ప్రశ్నించారు. కాగా, నూతన కార్యాలయాల నిర్మాణాలకు ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించగా, 18 మంది పోలీసు అమర వీరుల కుటుంబాలకు ఇళ్లస్థలాల పట్టాలు అందజేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మాలోతు ప్రియాంక, ఎంపీపీ భూక్యా గౌరి, రఘునాథపాలెం సర్పంచ్ గుడిపూడి శారదతో పాటు గుత్తా రవి, భూక్యా లక్ష్మణ్‌నాయక్, వీరూనాయక్, గుండాల కృష్ణ, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ర్యాలీలో వాహనంపై రాళ్లు

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెంలో శనివారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. గౌడ కులస్తులు నిర్మించిన కంఠమేశ్వరస్వామి, మైసమ్మ, ఎల్లమ్మతల్లి ఆలయాల ప్రారంభంతో పాటు విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు. ఇదే కులానికి చెందిన మరికొందరు పోటీగా మరో గుడి నిర్మించారు. ఓ వర్గం వారు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధును ఆహ్వానించగా ప్రచార రథంపై వస్తున్నారు. ఇంతలోనే కాంగ్రెస్ సానుభూతిపరులు నిర్వహిస్తున్న ర్యాలీ ఎదురుపడింది. ఈక్రమంలో ఇరువర్గాల నడుమ వాగ్వాదం మొదలుకాగా సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేష్‌కుమార్ అప్రమత్తయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు రాయితో ఎమ్మెల్యే కాన్వాయ్‌లోని ఓ వాహనం అద్దాలు పగులగొట్టారు. గొడవ పెరుగుతుండగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తమ కార్యకర్తలను సముదాయించి పూజలు చేసి వెళ్లిపోయారు.

బల ప్రదర్శనకు రెడీ..

- రాబోయే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా సీపీఐ సభ
- కొత్తగూడెంలో నేడు ప్రజాగర్జన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్మికులు, కర్షకుల్లో తన పట్టును ప్రత్యక్ష్యంగా చూపేందుకు సిద్ధమైంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ప్రజాగర్జన పేరిట లక్ష మందితో శనివారం కొత్తగూడెంలో భారీ సభ నిర్వహిస్తోంది. తద్వారా ప్రజలకు తమ భావజాలాన్ని చేరువ చేయడంతో పాటు ఇతర పార్టీలకు బలాన్ని చూపించనుంది.

కొత్తగూడెంపై ఫోకస్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు ఎన్నికయ్యాక పార్టీలో మునుపటి దూకుడు కనిపిస్తోంది. మతతత్వ బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని కూనంనేని పార్టీ వాయిస్‌ను బలంగా వినిపిస్తున్నారు. ఈక్రమంలో కలిసొచ్చే పార్టీలతో ఎన్నికల్లో పొత్తులు పెట్టుకునేందుకు సిద్ధమేనన్నారు. అయితే, పొత్తుల విషయంలో అడుగు ముందుకు పడాలంటే కొత్తగూడెం సీటుపై స్పష్టత రావాల్సిందేనని పట్టుబడుతున్నారు. కొత్తగూడెంలో సీపీఐ కచ్చితంగా బరిలో ఉంటుందని, దీనిపై స్పష్టత వచ్చాకే మిగతా చర్చలు సాగుతాయని ప్రకటిస్తున్నారు. అయితే ఇటు బీఆర్‌ఎస్, అటు కాంగ్రెస్ కొత్తగూడెం సీటును వదులుకునేందుకు సుముఖంగా లేవనే భావన ఉంది.



ముస్తాబుతున్న సభావేదిక

సత్తా చాటేందుకే 'గర్జన'..

సింగరేణి ప్రధాన కార్యాలయం ఉన్న కొత్తగూడెంలో కార్మిక సంఘాలకు, వాటిని నడిపించే వామపక్ష పార్టీలకు ఆది నుంచీ బలమెక్కువ. ముఖ్యంగా సీపీఐ అనుబంధ కార్మిక సంఘమైన ఏఐటీయూసీ(సింగరేణి కోల్‌మైన్స్ వర్కర్స్ యూనియన్) దశాబ్దాల పాటు కొత్తగూడెం గడ్డపై హవా కొనసాగించింది. తెలంగాణ ఉద్యమం మొదలయ్యే వరకు గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీదే పైచేయిగా ఉండేది. సుదీర్ఘ కాలం టీడీపీతో ఉన్న పొత్తు కారణంగా కొత్తగూడెం అసెంబ్లీ సీటును టీడీపీకి వదిలేసి, ఇల్లెందు, అప్పటి బూర్గంపాడు(పినపాక) నుంచి సీపీఐ బరిలో ఉండేది. 2009 ఎన్నికల్లో మహా కూటమి తరఫున కొత్తగూడెం సీపీఐ అభ్యర్థిగా సాంబశివరావు విజయం సాధించారు. అప్పటి నుంచి ఇక్కడ సీపీఐ బరిలో ఉంటోంది. రాబోయే ఎన్నికల్లోనూ కొత్తగూడెం నుంచి బరిలో ఉంటామని చెబుతున్న సీపీఐ నేతలు... ప్రజాగర్జన సభ విజయవంతం ద్వారా పొత్తులపై కొత్తగూడెం విషయంలో వాదన గట్టిగా వినిపించే అవకాశం ఉంటుందనేది సీపీఐ వ్యూహంగా కనిపిస్తోంది.

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి



పి.నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.నాగిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్ తదితరులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పి.నాగిరెడ్డి గతంలో జిల్లా, రాష్ట్ర కమిటీల్లో పలు బాధ్యతలు నిర్వర్తించారు.

రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ఖమ్మం సహకారనగర్: ఈనెల 12వ తేదీ సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమతాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా బడిబాటతో పాటు ఈసారి పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అందరి భాగస్వామ్యంతో ఆయా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించనున్నామని తెలిపారు.

విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు దిక్సూచి... మన విద్యాలయాలు

అగ్రగామి ఫలితాలు.. హార్వెస్ట్

ఖమ్మం సహకారనగర్: జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పరీక్షలైనా తమ విద్యార్థులు విజయం సాధించేలా తీర్చిదిద్దుతున్నట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నిర్వహించిన పరీక్షలు, ఈవెంట్లలో తమ విద్యార్థులు అత్యున్నత ప్రగతి కనబర్చారని చెప్పారు. 2022–23వ విద్యా సంవత్సరానికి గాను జరిగిన పదో తరగతి సీబీఎస్‌ఈ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణతతో పాటు 500కు గాను 494మార్కులతో ఇద్దరు విద్యార్థులు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. దేశవ్యాప్తంగా 21లక్షల మందికి పైగా పరీక్షలు రాయగా, 40వేల మందే(2శాతం) 95శాతానికి పైగా మార్కులు సాధించారన్నారు. హార్వెస్ట్ విద్యార్థులు 273మందికి గాను 27మంది అనగా 9.89శాతం విద్యార్థులు 95శాతానికి పైగా మార్కులు సాధించారని తెలిపారు. అలాగే, 90శాతంకు పైగా మార్కులు దేశంలో 10శాతం మంది విద్యార్థులు సాస్తే, హార్వెస్ట్ విద్యార్థులు 82మంది(32శాతం) సాధించారని వివరించారు.

తల్లిదండ్రుల సరైన ఎంపిక.. సర్వజ్ఞ

అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక వసతులతో ఖమ్మం పాఠశాలల్లో సర్వజ్ఞ స్కూల్ మేటిగా ఉందని కరస్పాండెంట్లు నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. నేటితరం చిన్నారుల ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా అన్ని రకాల వసతులతో పూర్తిస్థాయి ఏసీ క్యాంపస్‌గా ప్రారంభించినట్లు తెలిపారు. అనతికాలంలోనే పలువురి ప్రశంసలను అందుకుంటున్నట్లు చెప్పారు. చదువుతోపాటు విద్యార్థులకు స్పోర్ట్స్, డ్యాన్స్, యోగా, డ్రాయింగ్, కరాటేల్లో శిక్షణ ఇప్పించడంతో రాష్ట్ర, జిల్లాస్థాయిలో పతకాలు సాధించినట్లు తెలిపారు. సర్వజ్ఞ విద్యార్థులు చిన్న వయసులోనే లిమ్కా బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో స్థానం సాధించినట్లు పేర్కొన్నారు.

ఉత్తమ విద్య.. 'రెజొనెన్స్' శ్రీనగర్

విద్యార్థులకు ఉత్తమ విద్యనదించేందుకు నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న 'రెజొనెన్స్'ను ఎన్నుకోవాలని స్కూల్ చైర్మన్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. తమ స్కూల్‌లో ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌ను ఆధునిక పద్ధతుల్లో బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్‌పై శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఆటపాటల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తూ, అనుభవం, అంకిత భావంతో బోధించే సిబ్బంది తమ స్కూల్ ప్రత్యేకత అని చెప్పారు. అన్నికాలుగా విద్యార్థులు ఎదిగేందుకు అద్భుత విద్యాక్షేత్రం రెజొనెన్స్ స్కూల్ అని తెలిపారు.

విజ్ఞానం, వికాసం.. నిర్మల్ హృదయ్

విద్యార్థుల్లో విజ్ఞానం, వికాసం పెంపొందేలా విద్యాబోధన చేయడం నిర్మల్ హృదయ్ హైస్కూల్ ప్రత్యేకత అని ఫౌండర్ చైర్మన్ వంగా సాంబశివరెడ్డి, ప్రిన్సిపాల్ వంగా పద్మ తెలిపారు. విద్యార్థులకు మంచి విద్యనందించడమే కాక సామాజిక బాధ్యత పెంపొందించేలా కృషి చేస్తామని చెప్పారు. సృజనాత్మక, యాక్టివ్ ఆలోచనలు పెంచేలా ప్రైమరీ, ప్రీ ప్రైమరీ తరగతులకు ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిజిటల్ తరగతులు, విశాలమైన తరగతి గదులు, ప్లేగ్రౌండ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఉందని చెప్పారు.

ఉజ్వల భవిష్యత్‌కు.. న్యూ రిడ్జ్

విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే విద్యాసంస్థ న్యూ రిడ్జ్ అని పాఠశాల కరస్పాండెంట్ కావూరి పద్మావతి తెలిపారు. ఉత్తమ విద్య కేవలం కార్పొరేట్ ఫీజులు చెల్లించేవారికి మాత్రమే కాదని, మధ్య తరగతి కుటుంబీలకు చెందిన పిల్లలకు కూడా డిజిటల్ విద్య, ఫౌండేషన్‌ను అతి తక్కువ ఫీజులతో అందించడం న్యూరిడ్జ్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో సైన్స్‌ఫేర్, రాష్ట్రస్థాయి కరాటే, జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తమ విద్యార్థులు విజయదుందుభి మోగించారని పేర్కొన్నారు.

అందరికీ నాణ్యమైన విద్య.. మిలీనియం

ప్రతీ విద్యార్థిలో ప్రగతి సాధించడం నగరంలోని మిలీనియం స్కూల్ ప్రత్యేకత అని కరస్పాండెంట్ మహమ్మద్ జహీద్ అలీ పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకునేలా తమ ఫ్యాకల్టీచే విద్యాబోధన ఉంటుందని, ఆహ్లాదకరమైన వాతావరణం, విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా విద్యాబోధన సాగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ హైస్కూల్‌పై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటామని పేర్కొన్నారు. మంచి విద్యను అందించడం ద్వారా గొప్ప భవిష్యత్ ఇస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత శ్రద్ధ, అత్యుత్తమ గ్రేడ్లు.. క్రియేటివ్

2002వ సంవత్సరంలో ప్రారంభించిన తమ పాఠశాలలో విద్యార్థులను వ్యక్తిగత శ్రద్ధతో తీర్చిదిద్దుతుండగా అత్యుత్తమ గ్రేడ్లు సాధిస్తున్నారని క్రియేటివ్ హైస్కూల్ కరస్పాండెంట్ కమలాకర్ బిజ్జాల పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఐఐటీ , నీట్ శిక్షణ, వారాంతపు పరీక్షలు, సులభంగా అర్థమయ్యేలా బోధన తమకే సాధ్యమన్నారు. ఈసారి కూడా పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్ట్యా నాణ్యమైన బోధనతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

పటిష్టమైన విద్య.. రవి పబ్లిక్ స్కూల్

నగరంలోని సరిత క్లినిక్ సెంటర్‌లో ఉన్న రవి పబ్లిక్ స్కూల్ ద్వారా పటిష్టమైన విద్య అందజేస్తున్నామని డైరెక్టర్ పెడేటి రవీందర్ తెలిపారు. తమ విద్యాసంస్థలో సహజసిద్ధంగా బోధన సాగుతుందన్నారు. చిన్నారులకు ప్లేవే మెథడ్‌లో విద్యాబోధన ఉంటుందని, అనుభవం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన, డిజిటల్ క్లాస్‌లు, ఇంగ్లిష్ మీడియంలో నర్సరీ నుంచి 8వ తరగతి వరకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయం పెంపొందించేలా ప్రత్యేక బోధన సాగుతోందని వివరించారు.

ప్రత్యేకతలు.. భాష్యం

మామిళ్లగూడెంలోని భాష్యం స్కూల్‌లో అనేక ప్రత్యేకతలతో బోధన జరుగుతుందని కరస్పాండెంట్ ఉమాపార్వతి తెలిపారు. విశాలమైన క్యాంపస్‌లో చిన్నారులకు ప్లేవే మెథడ్‌తో బోధన ఉంటుందన్నారు. మ్యాథ్స్ ప్రాక్టీస్ క్లాసులు, స్టడీ అవర్స్ ఉంటాయని తెలిపారు. ప్రతిరోజు జరిగే స్లిప్ టెస్ట్, నోట్‌బుక్స్–2, స్టడీ హావర్స్, మ్యాథ్స్ ప్రాక్టీస్, నోట్ బుక్స్–3, రోజు ఇచ్చే వర్క్‌షీట్‌ను పేరెంట్ సంతకం కోసం ఇంటికి తీసుకెళ్తారని కరస్పాండెంట్ వెల్లడించారు. అంతేకాకుండా హోమ్ వర్క్, అలాగే డైరీలో ఆరోజు స్కూల్‌లో ఏం బోధించారో వివరిస్తారని పేర్కొన్నారు.

వికాసవంతమైన విద్య.. రెజొనెన్స్ వీడీవోస్ కాలనీ

వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్‌లో తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా వికాసవంతమైన విద్యనందిస్తున్నట్లు డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్, నీలిమ తెలిపారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి పది స్థానాల్లోని ఐఐటీ కాలేజీల్లో తమ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తోపాటు ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ ప్రస్తుత సమాజానికి కావాల్సిన విద్యావిలువలు బోధిస్తూ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ.. ప్రగతి

నగరంలోని ప్రగతి నవోదయ కోచింగ్ సెంటర్‌లో ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ ఉంటుందని కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ సురేష్ తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా నుంచి పాత బస్టాండ్ దగ్గరలోని ప్రగతి ఎంట్రన్స్ కోచింగ్ సెంటర్‌లో చక్కని వసతులతో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న పిల్లల్లో మెంటల్ ఎబిలిటీ, లాజికల్ థింకింగ్ పెరుగుతుందని పేర్కొన్నారు. ఏటా 50 శాతం సీట్లు తమ వద్ద కోచింగ్ తీసుకున్న విద్యార్థులే పొందారని తెలిపారు.

అందుబాటులో విద్య.. అభినవ్

నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో ఉన్న అభినవ్ కాన్సెప్ట్ స్కూల్‌లో విద్య సామాన్యులకు అందుబాటులో ఉంటుందని కరస్పాండెంట్ రమణ తెలిపారు. 2005–06లో 150 మంది విద్యార్థులతో స్కూల్ ప్రారంభించి.. 2012–13లో టెన్త్ వరకు అప్‌గ్రేడ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం 900 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారని తెలిపారు. అతితక్కువ ఫీజుతో అందరికీ అందుబాటులో విద్యనందిస్తున్నామన్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులు, సొంత భవనాలు, ఆటస్థలం ఉందని తెలిపారు.

వ్యక్తిగత శ్రద్ధ.. విన్‌ఫీల్డ్

ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో బోధన చేస్తున్నామని విన్‌ఫీల్డ్ హైస్కూల్ కరస్పాండెంట్ కిషోర్ తెలిపారు. తద్వారా ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో ఏటా విద్యార్థులు అఖండ విజయం సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కరిక్యులర్ యాక్టివిటీస్, కోకరిక్యులర్ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనపరిచేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి మధురానగర్ రోడ్‌నెంబర్ 4లో సొంత భవనాలలో మరో బ్రాంచ్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

నైతిక విలువలు పెంపు.. వివేకానంద

విద్యార్థుల్లో విజ్ఞానం, సృజనాత్మకత, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంచడమే శ్రీ వివేకానంద విద్యానికేతన్ లక్ష్యమని పాఠశాల కరస్పాండెంట్ వక్కలంక ఆనంద్ తెలిపారు. పాఠశాల ప్రారంభమై 48 ఏళ్లు అవుతోందని పేర్కొన్నారు. తమ వద్ద చదివిన విద్యార్థులు అనేకమంది అత్యున్నత స్థాయికి చేరామని తెలిపారు. అత్యున్నత విద్యాప్రమాణాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, విశాలమైన తరగతి గదులు, సీసీ కెమెరాల పర్యవేక్షణతో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

విలువలతో కూడిన విద్య.. న్యూ టైనిటాట్స్

విద్యార్థులు మార్కులు, గ్రేడ్లు సాధించడమే కాక ఉన్నతమైన విలువలతో కూడిన విద్యనందిస్తూ తమ పాఠశాల ముందంజలో ఉందని న్యూ టైనిటాట్స్ స్కూల్ హైస్కూల్ కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు తొమ్మిదేళ్లుగా నూరుశాతం ఫలితాలు సాధించడంతో పాటు ఉన్నత చదువుల్లోనూ ర్యాంక్‌లు సాధిస్తున్నారన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలుపుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

సులువైన పద్ధతిలో బోధన.. నిర్మల్

బల్లేపల్లిలోని నిర్మల్ హైస్కూల్‌లో విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ సూరపనేని సాయి తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధన ఉంటుందన్నారు. పాఠశాలలో స్మార్ట్ క్లాస్‌రూమ్స్, ఆడియో, వీడియో ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. యాక్టివిటీ బేస్డ్ బోధన ఉంటుందని తెలిపారు. డిజిటల్ విధానంలో సులువుగా బోధన చేస్తున్నట్లు వెల్లడించారు.

నాణ్యమైన బోధన.. 'వికాస్'

వీడీవోస్ కాలనీలో ఉన్న వికాస్ స్కూల్‌లో నాణ్యమైన బోధన, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ ఉంటుందని ప్రిన్సిపాల్ వై.లావణ్య తెలిపారు. గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అనుభవంతో స్కూల్ ప్రారంభించినట్లు చెప్పారు. నైపుణ్యం, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థి వికాసానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. థీమ్ కాన్సెప్ట్ బోధన, ఎడ్యుకేషనల్ ఫీల్డ్ ట్రిప్‌లు ఉంటాయన్నారు. ప్లేగ్రౌండ్, లైబ్రరీ, ఏసీ డిజిటల్ క్లాస్‌రూమ్స్ ఉన్నట్లు తెలిపారు.

విద్యాబోధనలో మేటి.. వాణీ వివేకానంద

వైరా: పట్టణంలోని వాణి వివేకానంద విద్యాలయం విద్యాబోదనలో మేటిగా నిలుస్తోందని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ దండూరి కోటేశ్వరరావు, వాణి తెలిపారు. విశాలమైన తరగతి గదుల్లో ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. విద్యాలయానికి హాస్టల్ వసతి, బస్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. డిజిటల్ క్లాస్‌రూమ్స్‌తో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రవేశాలు జరుగుతున్నట్లు వివరించారు.

క్లుప్తంగా...

భారతీయ మూలాలు నేటి తరానికి ఎంతో అవసరం

సనాతన సంప్రదాయాలతో యువతరాన్ని తీర్చిదిద్దాలి: తమిళిసై



మద్దిలపాలెం(విశాఖ తూర్పు): మన భారతీయ మూలాలు, సనాతన సంప్రదాయాలను నేటి యువతరానికి అందించాల్సిన అవసరం పెద్దలపై ఉందని, ఆ దిశగా కృషి చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. భారతీయత– అమృతకాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్. వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ప్రారంభమైంది. సద్గురు శివానందామూర్తి ఆశీస్సులతో సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రపంచ దేశాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయనీ అలాంటి మన మూలాలు నేటి తరానికి దూరం కాకుండా వారికి చేరువ చేయాలన్నారు. మన జీవన విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనీ, ఇలాంటి తరుణంలో మన పూర్వీకులు పాటించిన ఆధ్యాత్మికత, ఆహారపు అలవాట్లను, సంప్రదాయాలను యువతరానికి అందించాలని సూచించారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత వైస్ అడ్మిరల్ రామన్ పూరి మాట్లాడుతూ మన భారతీయతను భావితరాలకు చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రొఫెసర్ కె. సరస్వతి విద్యార్థిని రచించిన 'పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినకపాణి సంగీత నిధి'పుస్తకాన్ని ఆవిష్కరించారు.

23 మందితో తెలుగు మహిళ కమిటీ

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అనుబంధ విభాగమైన తెలుగు మహిళ రాష్ట్ర కమిటీలో 23 మందికి చోటు కల్పించారు. వీరికి శనివారం తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భవనం షకీలా రెడ్డి ఇప్పటికే నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ధనకాడ్ రాధిక (నల్గొండ పార్లమెంటు), అధికార ప్రతినిధిగా లక్ష్మి (నల్లగొండ పార్లమెంటు)తో పాటు ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, 15 మంది కార్యదర్శులు కొత్తగా నియమితులయ్యారు.

ఉద్దానానికి ఊపిరి

కిడ్నీ వ్యాధికి శాశ్వతంగా చరమగీతం పాడేలా ఏపీ ప్రభుత్వం చర్యలు

రూ.700 కోట్లతో చేపట్టిన మంచి నీటి పథకం ట్రయల్ రన్‌కు సిద్ధం

- ఖర్చుకు వెనకాడకుండా ఏడాది పొడవునా నీటి సరఫరాకు ప్రాధాన్యత
- 100 కి.మీ దూరంలోని హీరమండలం నుంచి నీటి తరలింపు
- నదుల కింద, కొండలను తొలిచి భూగర్భ పైపులైన్ నిర్మాణం
- మొత్తంగా 1047 కి.మీ పొడవునా భూగర్భ పైపులైన్

గ్రౌండ్ రిపోర్ట్



మెలియాపుట్టి వద్ద నీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌లు

ఉద్దానం ప్రాంతం నుంచి మేడికొండ కోటిరెడ్డి, వద్దే బాలశేఖర్: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడి అల్లాడుతుంటే గత ప్రభుత్వాలు మాటలతో మభ్యపెడితే.. వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వేసిన అడుగులు ఫలితాలివ్వడానికి సిద్ధమయ్యాయి. నాలుగు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న నీటి సమస్య పరిష్కారించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.700 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభోత్సవ దశకు చేరింది. హీరమండలం నుంచి తాగునీటిని తరలించే ప్రక్రియలో ఉపయోగించే నీటి మోటార్లకు మూడు, నాలుగు రోజుల్లో ట్రయల్ రన్ మొదలవ్వనుంది.

దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యం

ఉద్దానం ప్రాంతంలో అక్కడి భూగర్భ జలాలనే తాగునీటిగా ఉపయోగించడం వల్ల కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నాయనే వాదన ఉంది. ప్రజల్లో కూడా ఇదే విషయమై ఆందోళన ఉంది. అయితే ఇప్పుడు కూడా ఆ ప్రాంతంలో కొన్ని మంచినీటి పథకాలు ఉన్నా.. అవి ఎక్కువగా స్థానికంగా బోర్లు వేసి సరఫరా చేసేవే. మరోవైపు.. తక్కువ ఖర్చుతో ఉద్దానం ప్రాంత సమీపంలో ఉండే బహుదా, మహేంద్ర తనయ నదుల నుంచి రక్షిత నీటి సరఫరాకు అవకాశం ఉన్నా, వేసవిలో ఆ నదులు ఎండిపోతే ప్రజలు బోరు నీటిని తాగక తప్పదని జగన్ సర్కార్ ఆ ప్రతిపాదనను మొదట్లోనే పక్కన పెట్టింది. ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండేలా ఖర్చు ఎక్కువైనా సరే వెనుకాడకుండా హీరమండలం రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు పూనుకుంది. ఉద్దానం ప్రాంతం మొత్తానికి ఏడాది పొడవునా నీటి అవసరానికి ఒక టీఎంసీ కన్నా తక్కువ నీరే అవసరం ఉంటుంది. హీరమండలం రిజర్వాయర్ కనీస నీటి మట్టం 2.67 టీఎంసీలు ఉండటం వల్ల ఉద్దానం ప్రాంతానికి నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

జగన్ ప్రభుత్వ 'భగీరథ'యత్నం

హీరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి నీటి తరలింపు అషామాషీ కాకపోయినా ప్రభుత్వం పట్టుదలగా పనులు చేపట్టి పూర్తి చేసింది. ఈ ప్రక్రియలో ఏకంగా 1,047 కిలోమీటర్ల పొడవునా భూగర్భ పైపులైన్ల నిర్మాణం చేశారు. రోజూ 8.40 కోట్ల లీటర్ల మేర తాగునీరు ఆ భూగర్భ పైపు లైను ద్వారా వెళ్లేలా పనులు చేపట్టారు. కేవలం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ మోటార్లు ఒక్కొక్కటి నిమిషానికి 28 వేలకు పైగా లీటర్ల నీటిని పంపింగ్ చేయగలవు. ఈ నీరు ఎగుడు దిగుడు కొండలు, మైదాన ప్రాంతాలు దాటుకుంటూ.. మధ్యలో మరే మోటార్ల అవసరం లేకుండా 32 కిలోమీటర్ల దూరంలోని మిలియపుట్టి శుద్ధి కేంద్రానికి చేరతాయి. అత్యవసర సమయాల్లో ఉపయోగించడానికి మూడో మోటార్‌ను అదనంగా ఏర్పాటు చేశారు. నీటి తరలింపు మార్గంలో వంశధార నది ఉండటంతో నదీ గర్భంలో దాదాపు అర కిలోమీటర్ మేర పైపు లైన్ నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల కొండలను తొలిచి పైప్‌లైన్ వేశారు. ఒక్కసారిగా 73 మీటర్ల ఎత్తుకు.. ఆపై 50 మీటర్లు దిగువకు.. మళ్లీ 147 మీటర్ల ఎత్తున ఉండే కొండపైకి.. మళ్లీ దిగువకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. మరో మాటలో చెప్పాలంటే భగీరథ యత్నమే చేశారు.

కరోనా లేకుంటే ఇప్పటికే అందుబాటులోకి..

ఉద్దానం ప్రాంతంలో కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని గ్రామాల పరిధిలో కిడ్నీ సమస్య ఉంది. ఈ సమస్యకు అసలు కారణం ఏమిటన్నది ఇంత వరకు స్పష్టంగా నిర్ధారణ కానప్పటికీ.. ఆ ప్రాంత ప్రజలు తాగునీటి అవసరాలకు అక్కడి భూగర్భ జలాలు వినియోగించడం ఒక కారణం కావొచ్చనే నిపుణుల అనుమానాల మేరకే జగన్ ప్రభుత్వం నివారణ చర్యలు మొదలుపెట్టింది. సురక్షిత తాగునీటి సరఫరాకు ఉద్దేశించి ఈ మంచినీటి పథకానికి సీఎం జగన్ 2019 సెప్టెంబర్ 6న శంకుస్థాపన చేశారు. తర్వాతి సంవత్సరంలోనే కరోనా వ్యాప్తి మొదలైంది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ విధింపు, మరుసటి ఏడాది కూడా రెండో దశ కరోనా వ్యాప్తి కారణంగా ప్రపంచమే స్తంభించిపోయింది. ఈ ప్రభావం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంపైనా పడింది. ఈ సమస్య లేకుంటే ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఉండేది.

బాబు, పవన్.. మాటలతోనే సరి

గత చంద్రబాబు ప్రభుత్వం ఉద్దానం సమస్య పరిష్కారం పూర్తిగా పక్కన పెట్టిందనే చెప్పాలి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక తొలి మూడు సంవత్సరాల పాటు ఈ సమస్యను పరిష్కరించేందుకు ఒక్క చర్యా చేపట్టలేదు. చివరి ఏడాది 2018లో కేంద్ర పరిశోధన సంస్థ ఐసీఎంఆర్, జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సంస్థలతో ఉద్దానం కిడ్నీ సమస్యపై పూర్తి స్థాయి అధ్యయనం చేయిస్తామని ప్రకటించారు. అది కూడా ప్రకటనకే పరిమితమైంది. అప్పట్లో తెలుగుదేశం మిత్రపక్షంగా ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ 2018 మే లో ఒకట్రెండు రోజుల పాటు శ్రీకాకుళం జిల్లాలో దీక్షలంటూ హడావుడి చేశారు. ఆ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒకసారి సమావేశమై ఆ సమస్యను పూర్తిగా వదిలేశారు.

కన్నకొడుకే కాలయముడా..?

- భద్రాద్రి జిల్లా సారపాకలో వ్యక్తి దారుణహత్య
- పెద్దసుత్తితో తలపై కొట్టి చంపిన వైనం
- డ్రగ్స్‌కు బానిసైన కుమారుడిపైనే అనుమానం



రఫీ (ఫైల్)

బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో శుక్రవారం అర్ధరాత్రి ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడైన సయ్యద్ రఫీ(38) ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. ఈ కేసులో రఫీ కుమారుడి(15)పైనే పోలీసులు అనుమానిస్తున్నారు. రఫీకి, భార్య జీనత్‌కు మధ్య కుటుంబ కలహాలున్నాయి. వీరి కుమారుడు 9వ తరగతిలో చదువు మానేశాడు. ఏడాది కాలంగా గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి ఇంట్లో తండ్రితో గొడవపడుతుండేవాడు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆ బాలుడు శుక్రవారం ఉదయం తిరిగి వచ్చాడు. ఇన్ని రోజులు ఎక్కడికెళ్లావని తండ్రి నిలదీయగా, ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శుక్రవారం ఐటీసీ డ్యూటీకి వెళ్లి వచ్చిన రఫీ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో అతని కొడుకే పెద్ద సుత్తితో మోది హత్య చేశాడని స్థానికులు అనుమానిస్తున్నారు. పోలీసు జాగిలాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టగా హత్యకు ఉపయోగించిన పెద్ద సుత్తి మోతె గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో లభించింది. అక్కడికి సమీపంలోనే రక్తపు మరకలతో ఉన్న రఫీ కుమారుడు దుస్తులను కూడా పోలీసు జాగిలాలు గుర్తించాయి. దీంతో రఫీ కొడుకును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, తన అన్నను ఆయన కుమారుడు, భార్య కలసి హత్య చేశారని మృతుడి సోదరుడు సయ్యద్ బాజీబాబా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, సీఐ నాగరాజు, ఎస్సై సంతోష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

ఖమ్మం మార్కెట్‌లో అగ్నిప్రమాదం

రూ. 41.31 లక్షల విలువైన 1,519 బస్తాల పత్తి దగ్ధం



ఖమ్మం మార్కెట్‌లో దగ్ధమవుతున్న పత్తి నిల్వలు

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి యార్డులోని షెడ్డులో నిల్వ ఉంచిన ఓ ట్రేడర్ గ్రూపునకు చెందిన 1,519 బస్తాల పత్తి ఈ ఘటనలో అగ్నికి ఆహుతైంది. ఈ పత్తి విలువ రూ.41.31 లక్షలు ఉంటుందని అంచనా. శ్రీశివ గణేష్ కృష్ణ ట్రేడర్స్ వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్ కొనుగోలు చేసిన 1,809 బస్తాల పత్తిని షెడ్డులో నిల్వ చేయగా శనివారం మధ్యాహ్నం నిప్పంటుకుంది. సిబ్బంది స్పందించి 290 బస్తాలను బయటకు లాగేసినప్పటికీ, 1,519 బస్తాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పత్తి క్వింటాకు రూ.6,800 చొప్పున లెక్కించి రూ.41,31,680 విలువైన పత్తి అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని అధికారులు వెల్లడించారు. షెడ్డులో నిల్వ చేసిన పత్తి బస్తాలకు నిప్పు ఎలా అంటుకున్నదీ తెలియడంలేదు. అగ్ని ప్రమాదం జరిగిన షెడ్డు వైపు సీసీ కెమెరాలు లేకపోవటంతో కారణాలు గుర్తించలేకపోతున్నారు. కాగా, నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక యంత్రాన్ని కొద్ది నెలల క్రితం ఖమ్మం మార్కెట్‌కు కేటాయించారు. కానీ మే నెలలో మార్కెట్‌కు వేసవి సెలవులు ప్రకటించగా యంత్రాన్ని తిరిగి నేలకొండపల్లి పంపించారు. ఈనెల 6న మార్కెట్ పునఃప్రారంభమైనా యంత్రాన్ని రప్పించలేదు. ఖమ్మం, నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

జిల్లా వార్తలు

వడ్డెరల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో వడ్డెరల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వడ్డెరల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణరాజు తెలిపారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ భగయత్‌లో కేటాయించిన స్థలంలో విద్యార్థి వసతిగృహం నిర్మించనున్నట్లు చెప్పారు. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా కమిటీలు వేసేందుకు పర్యటిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కుంచపు వెంకటేశ్వర్లు, ఎత్తరి అంతయ్య, చందార్‌రావు, జి.వెంకటేశ్వర్లు, యల్లయ్య, రాజు,యాదగిరి, జి.వెంకటేశ్వరావు, హనుమాన్, రాము, పుల్లారావు, రామదాసు, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, సోమరాజు, శ్రీనివాస్, రాఘవ, సీహెచ్. నాగేశ్వరావు, జానయ్య, చిన్న వెంకటేశ్వర్లు, వీరయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

నార్కోటిక్ డాగ్ టామీ కన్నుమూత

ఖమ్మంక్రైం: పోలీస్ నార్కోటిక్ విభాగానికి చెందిన జాగిలం టామీ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. మాదక ద్రవ్యాలు కనిపెట్టడంలో మొహినాబాద్‌లో శిక్షణ పొందిన టామీ శిక్షణ సమయంలోనే బంగారు పతకం సాధించింది. ఎనిమిదేళ్ల పాటు గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల గుర్తింపులో పోలీసులకు సహకరించింది. ఈమేరకు ఆర్ఐలు రవి, శ్రీనివాస్, డాగ్ హ్యాండ్లర్ సూరజ్‌కుమార్ తదితరులు జాగిలం మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించాక అంత్యక్రియలు నిర్వహించారు.

మార్కెట్ ఉద్యోగులకు పదోన్నతి

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్లలో సహాయ కార్యదర్శులు, అకౌంటెంట్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు గ్రేడ్–3 కార్యదర్శులుగా, సూపరింటెండెంట్లుగా ఉద్యోగోన్నతి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 29మంది పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేయగా ఉమ్మడి ఖమ్మంలో నలుగురికి జాబితాలో స్థానం దక్కింది. ఖమ్మం మార్కెట్ సహాయ కార్యదర్శి నిర్మలను భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శిగా, ఎస్.రాజేంద్రప్రసాద్‌ను మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శిగా, కల్లూరు సహాయ కార్యదర్శి తాడేపల్లి కిరణ్‌కుమార్‌కు భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శిగా, వైరా సహాయ కార్యదర్శి వి.నాగేశ్వరికి మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శిగా పదోన్నతి కల్పించి నేలకొండపల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. త్వరలోనే సీని యారిటీ ఆధారంగా సూపర్‌వైజర్లకు సహాయ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించే అవకాశముందని సమాచారం.

కాలిబూడిదైన పత్తి బస్తాలు

- ఖమ్మం మార్కెట్‌లో అగ్నిప్రమాదం
- ఆహుతైన రూ.41.31లక్షల విలువైన 1519 పత్తి బస్తాలు
- అగ్నిమాపక యంత్రం లేకపోవడంతోనే నష్టతీవ్రత



ఖమ్మం మార్కెట్‌లో దగ్ధమవుతున్న పత్తి నిల్వలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పత్తి యార్డులోని షెడ్డులో నిల్వ చేసిన ట్రేడర్ గ్రూపునకు చెందిన రూ.41.31లక్షల విలువైన 1,519 బస్తాల పత్తి ఆహుతైంది. మార్కెట్ కమిటీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీ శివగణేష్ కృష్ణ ట్రేడర్స్ వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్‌కు కొంత కాలంగా కొనుగోలు చేసిన 1,809 బస్తాల పత్తిని నిల్వ చేయగా మంటలు చెలరేగగానే 290 బస్తాలను బయటకు లాగారు. మిగతా పత్తి కాలిపోయింది. కాగా, మార్కెట్‌లో శనివారం పత్తి, మిర్చి కొనుగోళ్లకు సెలవు ఉండగా, అపరాల కొనుగోళ్లు సాగుతున్నాయి. ఈక్రమంలోనే అపరాలు క్రయవిక్రయాలు జరిగే పెద్ద షెడ్డు వెనుక షెడ్డులో నిల్వ చేసిన పత్తి దగ్ధమైంది. అపరాల యార్డులో కొనుగోళ్లు ముగిశాక మధ్యాహ్నం ఎండ మడిపోతున్న నేపథ్యాన మంటలు ఎగిసిపడ్డాయి. అయితే, ఎవరైనా సిగరెట్ పడేసి ఉండడంతో ప్రమాదం జరిగిందని కొందరు, షార్ట్ సర్క్యూట్ కారణమని మరికొందరు చెబుతున్నారు. కాగా, ప్రమాదం జరిగిన షెడ్ వైపు సీసీ కెమెరాలు లేకపోవటంతో బాధ్యుల గుర్తింపులో జాప్యం జరుగుతోంది.

ఫైర్ ఇంజన్ లేదు..

ఖమ్మం మార్కెట్‌కు ఈ ఏడాది తొలినాళ్లలో నేలకొండపల్లి నుంచి ఫైర్ ఇంజన్‌ను కేటాయించారు. అయితే, మార్కెట్‌కు వేసవి సెలవులు ఇవ్వగానే మళ్లీ వాహనాన్ని నేలకొండపల్లి పంపించారు. కానీ ఈనెల 6న మార్కెట్ ప్రారంభమైనా వాహనం రాకపోవడంతో ప్రమాదం జరగగానే మంటలు ఆర్పడం సాధ్యం కాలేదు. ఖమ్మం, నేలకొండపల్లిల నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చే సరికి నష్టం జరిగిపోయింది. కాగా, ఖమ్మం మార్కెట్‌లో ఆస్తులు, పంటలకు నష్టం జరిగితే బీమా పొందేలా రూ.38.795 కోట్లకు ఇన్సూరెన్స్ చేయించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు చిన్ని కృష్ణారావు, సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, నల్లమల ఆనంద్ తదితరులు చేరుకుని అధికారులకు బీమా అందేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, వరంగల్ ఆర్‌జేడీ మల్లేశం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఘటనపై వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్ మాట్లాడుతూ లారీల కొరతతో రవాణా చేయలేకపోయామని, ఈప్రమాదంతో కోటి మేర నష్టం జరిగిందని వాపోయారు.

పత్తి, మొక్కజొన్న నిల్వలకు తప్పిన ప్రమాదం

మార్కెట్‌లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదం ఒక్క షెడ్డులోని పత్తి నిల్వకు మాత్రమే పరిమితం కావటంతో పక్క షెడ్లలో నిల్వ ఉన్న పత్తి, మొక్కజొన్న పంటలకు ముప్పు తప్పినట్లయింది. పత్తి యార్డులో 12 షెడ్లలో ఎనిమిదింట వ్యాపారులు పత్తి నిల్వ చేశారు. అంతేకాక మొక్కజొన్నలు కూడా నిల్వ చేశారు. అయితే, నిప్పు అంటుకున్న సమయాన వడగాలుల ప్రభావం లేకపోవడంతో పెనుముప్పు తప్పినట్లయింది.

2017లో విధ్వంసం

మిర్చి ధర తగ్గించడంపై 2017 ఏప్రిల్ 28వ తేదీన రైతులు ఖమ్మం మార్కెట్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో యార్డులతో పాటు ఫర్నీచర్, పరికరాలను నిప్పంటించగా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఆ తర్వాత శనివారం జరిగిన ప్రమాదమే పెద్దదిగా చెబుతున్నారు. ఈ ప్రమాదంతపై వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మాదిగలకు పదవులు ఎందుకు దక్కలేదు?


ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ



కూసుమంచిలో మాట్లాడుతున్నమంద కృష్ణ

కూసుమంచి/ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాదిగలకు ఒక మంత్రి పదవి కూడా దక్కకపోవడానికి కారణాలేమిటో సీఎం కేసీఆర్ వెల్లడించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. కూసుమంచి, ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ యాభై ఏళ్ల చరిత్రలో మాలలు 75 వేల ఉద్యోగాలు పొందితే, మాదిగలు కేవలం రెండు శాతం ఉద్యోగాలే పొందారన్నారు. ఆ తర్వాత 2000 నుంచి 2005 సంవత్సరం వరకు వర్గీకరణ అమలైతే కొందరు నిలిపివేయించారని ఆరోపించారు. దీంతో మళ్లీ మాదిగలకు అన్యాయం జరుగుతోందన్నారు. వర్గీకరణ అమలు కోసం వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరగనున్న సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో నాయకులు వంగూరి ఆనందరావు, పగిడికత్తుల ఆదయ్య, పొట్టపింజర బాలస్వామి, యాకోబ్బి, వెంకన్న, రవీందర్, వెంకటేశ్వర్లు, సురేష్, సతీష్, శ్రీకాంత్, శ్రీనివాస్, నర్సింహారావు, వినోద్, గోపాలరావు, ప్రభాకర్, నాగేశ్వరావు, సైదులు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

భట్టి పాదయాత్ర వెయ్యి కి.మీ.కు చేరడంపై సంబరాలు



కేక్ కట్ చేస్తున్న దుర్గాప్రసాద్, నాయకులు

ఖమ్మంసహకారనగర్: సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర శనివారం వెయ్యి కిలోమీటర్లు పూర్తికావడంతో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశాక డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడారు. రాహుల్‌గాంధీ జోడోయాత్ర స్ఫూర్తితో భట్టి చేపట్టిన పాదయాత్ర ఈనెల 25న ఖమ్మంలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. ఈ సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ నేతల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. నాయకులు బెల్లయ్య నాయక్, రాందాస్‌నాయక్, రాయల నాగేశ్వరావు, వడ్డే నారాయణరావు, పుచ్చకాయల వీరభద్రం, బానోత్ రాజునాయక్, యడ్లపల్లి సంతోష్, మొక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, వేగినాటి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధం

పరుగులు తీసిన పెళ్లి బృందం సభ్యులు

నేలకొండపల్లి: పెళ్లి వేడుక ముగించుకుని ప్రైవేట్ స్కూల్ బస్సులో ఇంటికి వెళ్తుండగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో బస్సు కాలిపోగా, డ్రైవర్ అప్రమత్తతతో ముప్పై మంది సురక్షితంగా బయటపడ్డారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలానికి చెందిన ఓ ప్రైవేట్ బస్సులో దాదాపు 30 మంది వివాహ రిసెప్షన్ కోసం శనివారం ఖమ్మం వచ్చారు. తిరుగు ప్రయాణంలోనేలకొండపల్లిలోని కట్టలమ్మ చెరువు వద్దకు రాగానే బస్సులో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో డ్రైవర్ రమేష్ అప్రమతమై బస్సును పక్కకు ఆపాడు. ఇంతలోనే పెళ్లి బృందం సభ్యులు అరుపులు, కేకలతో బస్సు దిగి పరుగులు తీశారు. అందరూ కిందకు దిగాక మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే, ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చినా ఖమ్మం మార్కెట్‌లో జరిగిన ప్రమాదస్థలి వద్దకు వెళ్లడంతో వాహనం రాలేదు. నేలకొండపల్లి సర్పంచ్ రాయపూడి నవీన్, కార్యదర్శి దేవేందర్ చొరవ తీసుకుని పంచాయతీ వాటర్ ట్యాంకర్ పంపించగా పోలీసులు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ హానీ జరగలేదని ఎస్సై జి.స్రవంతి తెలిపారు.



నేలకొండపల్లిలో కాలిపోతున్న ప్రైవేట్ స్కూల్ బస్సు

కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్

ఖమ్మంలీగల్: కేసులను సత్వరమే పరిష్కరిస్తూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికి లోక్ అదాలత్ ఉత్తమమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని న్యాయసేవాసదన్‌లో శనివారం ఎస్‌బీఐ దాఖలు చేసిన రుణ వసూళ్ల కేసును పరిష్కరించిన ఆయన జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. అలాగే, రూ.19 లక్షల పరిహారాన్ని అందించే మోటారు ప్రమాద కేసును పరిష్కరించి మాట్లాడారు. ఇరు పక్షాల వారికి ఉపయుక్తమైన పరిష్కారం అందించే వేదిక లోక్ అదాలత్ అని, కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

7,880 కేసుల పరిష్కారం

జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 7,880 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా కేంద్రంలోని కోర్టులో అదనపు జిల్లా జడ్జి డి.రాంప్రసాద్‌రావు అధ్యక్షత వహించిన బెంచ్‌లో 62 మోటారు వాహన ప్రమాద కేసులను పరిష్కరించి రూ.2.48 కోట్ల పరిహారం ఇప్పించారు. సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.అమరావతి అధ్యక్షత వహించిన బెంచ్‌లో పది, మొదటి అదనపు మెజిస్ట్రేట్ కె.దీప అధ్యక్షత వహించిన బెంచ్‌లో 1,203, మూడో అదనపు మెజిస్ట్రేట్ వి.మాధవి అధ్యక్షతన ఏర్పాటైన బెంచ్‌లో 2,672, ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ఆర్.శాంతిలత అధ్యక్షతన ఏర్పాటైన బెంచ్‌లో 715 కేసులు పరిష్కరించారు. ఇంకా సత్తుపల్లిలో 853, మధిరలో 2,312 కేసులతో పాటు ఇతర కేసులు 53 పరిష్కారమయ్యాయి. అదనపు జిల్లా జడ్జి డి.రాంప్రసాదరావు, న్యాయసేవాసంస్థ కార్యదర్శి, అబ్దుల్ జావేద్‌పాషా, న్యాయవాదులు మాది రాజు లక్ష్మీనారాయణ, ఎ.విజయరాఘవ, జి.అమర్‌నాథ్, జె.ప్రవీణ్‌కుమార్, ఆర్.వెంకట్ పాల్గొన్నారు.